ప్రోత్సాహం అందలే.. కష్టాలు తీరలే

- ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం
- నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు
- ఐదేళ్లుగా నిధుల కోసం ఎదురుచూపు
- పట్టించుకోని ప్రభుత్వాలు



ఏకగ్రీవమైన తిమ్మాపురం గ్రామ పంచాయతీ భవనం

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామ పంచాయతీలను ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుంటే ప్రజల్లో ఐకమత్యం పెరిగి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించడం సులభమవుతుందని ప్రభుత్వాలు భావించాయి. దీని కోసం ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం అయ్యే పంచాయతీలకు ప్రత్యేక ప్రోత్సాహం ద్వారా నిధులను అందించాలని 2001లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ఆధారంగా ఏకగ్రీవ పంచాయతీలకు రూ.7లక్షల వరకు నిధులు మంజూరయ్యేవి. 2019లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇట్టి ఏకగ్రీవ పోత్సాహకాన్ని భారీగా పెంచింది. దీంతో గ్రామ అభివృద్ధి కోసం గ్రామస్తులంతా ఏకమై పలు పంచాయతీలను ఏకగ్రీవం చేశారు. కానీ ఐదేండ్లు గడిచి పదవి పూర్తైనా నేటికీ పోత్సాహక నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఏకగ్రీవ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ నిధులతో పాటు అదనంగా..

ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు సాధారణ పంచాయతీలకు అందించే నిధులతో పాటుగా అదనంగా ప్రోత్సాహక నిధులను అందజేస్తారు. ఈ పథకాన్ని దేశంలో మొదటగా 1960లో రాజస్థాన్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం తెలంగాణ, హరియాణ, గుజరాత్ రాష్ట్రాల్లో మాత్రమే ఏకగ్రీవం అయ్యే పంచాయతీలకు ఈ ప్రోత్సాహక పథకం అమలవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2001 నుంచి అమలవుతుండగా, 2006 నుంచి జీపీలకు రాయితీలు ఇస్తున్నారు. అనంతరం 2013లో జీఓ నెంబర్ 1274ను తీసుకొచ్చి పలు సవరణలు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక అదనంగా కొత్త పంచాయతీలు ఏర్పడటంతో పాటుగా రాష్ట్రంలో కొత్త పంచాయతీ చట్టం అమల్లోకి వచ్చింది. దీని ద్వారా ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను పెంచింది. దీంతో పాత పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పడిన పంచాయతీలు సైతం అభివృద్ధిని ఆకాంక్షించి పలు పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నాయి. కానీ ఎన్నికలు జరిగి ఐదేండ్లు గడుస్తున్నా నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో ప్రజా ప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


తిమ్మాపురం జీపీలో అభివృద్ధిపై గ్రామసభను నిర్వహిస్తున్న సర్పంచ్ (ఫైల్)

13 ఏకగ్రీవ పంచాయతీలు..

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా, మొత్తం 124 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో 13 పంచాయతీలు 2019లో ఎన్నికలు లేకుండా ప్రజల సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.15 లక్షల నజరానా ఇస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలకు ముందు ప్రకటించింది. దీని ద్వారా నియోజకవర్గంలో ఏకగ్రీవమైన 13 జీపీలకు రూ.1.95 కోట్లు ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. గతంలో రూ.7 లక్షలున్న పోత్సాహకాన్ని టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 ఎన్నికల సందర్భంగా రూ.10 లక్షలకు పెంచింది. దీనికి అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి కూడా రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.15 లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు అందించాల్సిన ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేసి అభివృద్ధి కోసం అప్పులపాలైన తమను ఆదుకోవాలని సర్పంచులు కోరుతున్నారు.

ఆయా మండలాల వారీగా ఏకగ్రీవ గ్రామ పంచాయతీల వివరాలు

మండలం	జీపీలు	ఏకగ్రీవ పంచాయతీలు
ఇటిక్యాల	29	పుటాన్‌దొడ్డి, తిమ్మాపురం, నక్కలపల్లి.
మానవపాడు	16	కలుకుంట్ల.
వడ్డేపల్లి	10	తిమ్మాజిపల్లి, వెంకట్రామనగర్.
రాజోళి	11	పడమటి గార్లపాడు.
ఉండవెల్లి	16	భైరాపురం.
అలంపూర్	14	ఏకగ్రీవం కాలేదు.
అయిజ	28	కురవపల్లి, గుడిదొడ్డి, కిష్టాపురం, నారోజీ క్యాంపు, కొత్తపల్లి.

నిధులు రాక ఇబ్బందులు పడ్డాం..



గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రత్యేక ప్రోత్సాహక నిధుల కోసం గ్రామస్తులమంతా ఏకమై పంచాయతీని ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేసుకున్నాం. కానీ గ్రామంలో అదనంగా పలు అభివృద్ధి పనులను చేపడదామంటే ప్రోత్సాహక నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. దీనివల్ల గ్రామంలో ప్రజల నుంచి చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేయాలి.

– స్వాతి, సర్పంచ్, పుటాన్‌దొడ్డి

కొత్త ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలి..



గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం గ్రామస్తుల సహకారంతో మా పంచాయతీని 2019 ఎన్నికల్లో ఏకగ్రీవం చేసుకున్నాం. మా గ్రామ పంచాయతీకి ప్రోత్సాహక నిధుల కింద ప్రభుత్వం అందించే రూ.15 లక్షల నిధులొస్తే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని ఐదేళ్లుగా ఎదురుచూశాం. మా పదవీ కాలం పూర్తైనా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం మంజూరు కాలేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పంచాయతీని అభివృద్ధి చేసుకుంటాం.

– నాగేశ్వరి, సర్పంచ్, తిమ్మాపురం

ప్రభుత్వానికి నివేదించాం..



మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మూడు పంచాయతీల వివరాలను గతంలోనే ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు ఆయా పంచాయతీలకు మంజూరు కావల్సి ఉంది. ఇటీవల శాసన మండలి ఎన్నికలు జరగడంతో ప్రభుత్వం కూడా మారింది. నూతన ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు విడుదలైతే ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు సమాచారం అందించి ఆయా పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను జమచేయిస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం

అలంపూర్ రూరల్: సర్పంచ్‌ల పదవీకాలం గురువారంతో ముగిసింది. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. మండలంలోని ర్యాలంపాడ్, శింగవరం–1, శింగవరం–2 గ్రామాలకు తహసీల్దార్ మంజుల, లింగన్‌వాయి, భీమవరం ఎంపీఓ చంద్రకళ, క్యాతూర్, ఉట్కూర్‌కు వ్యవసా య అధికారిణి అనిత, భైరంపల్లి, గొందిమల్ల, కాశీపూర్ గ్రామాలకు డీటీ శివకుమార్, సుల్తాన్‌పూర్, జిల్లెలపాడ్, బుక్కాపూర్ గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఎంపీఓ చంద్రకళ తెలిపారు.

శాంతినగర్: గ్రామ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను ఉన్నతాధికారులు గురువారం నియమించారు. గెజిటెడ్ అధికారులను నియమించాలనే నిబంధనను ప్రభుత్వం సూచించడంతో కొంకల, కోయిల్‌దిన్నె, జిల్లెడుదిన్నె గ్రామ పంచాయతీలకు ఎంపీడీఓ రవీంద్ర, తనగల, జూలెకల్ తహసీల్దార్ జ్యోతి, రామాపురం, బుడమొర్సు, వెంకట్రామనగర్ ఎంపీఓ తిరుపతన్న, తిమ్మాజిపల్లి, జక్కిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలకు మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ తేజవర్ధన్‌లను నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం, చెక్‌పవర్ గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు ప్రత్యేకాధికారికి కల్పిస్తున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

కేటీదొడ్డి: సర్పంచ్‌ల పదవీకాలం మగియడంతో మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు స్పెషల్ అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహిద్దీన్ తెలిపారు. నందిన్నె, ఉమిత్యాల, ఉమిత్యాలతండాకు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహిద్దీన్, ఇర్కిచేడు, పాగుంట, వెంకటాపురానికి ఎంపీఓ మొహద్ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, మైలగడ్డ, రంగాపురం, మల్లాపురంతండాకు త హసీల్దార్ సరితరాణి, గువ్వలదిన్నె, కేటీదొడ్డిలకు ఈఈ ఇరిగేషన్ వెంకటేశ్వర్‌రావు, గంగన్‌పల్లి, పాతపాలెంకు ఏఓ మహాలక్ష్మి, చింతలకుంట, కుచినెర్ల, మల్లాపురం గ్రామాలకు ఏఈఆర్‌డబ్ల్యూ మల్లేష్, ఎర్సన్‌దొడ్డి, సుల్తాన్‌పురం, సోంపురం గ్రామాలకు ఏఈ ఉమర్, పూజారితండా, తూర్పుతండా, ఏఈ లోక్యనాయక్, ఈ ర్లబండ, కొండాపురం గ్రామాలకు డీటీ శివశంకర్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



అలంపూర్: హైదరాబాదులోని అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యదర్శులతో సమావేశం

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీఓ రమణారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమౌతుందని గ్రామాల్లో తగు చర్యలు తీసుకోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులను సజావుగా జరిగేలా చూసుకుంటూ, వందశాతం టాక్స్ వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీల్లో 100శాతం విత్తనాలు మొలకెత్తేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పనులకు వెళ్తున్న క్రమంలో కూలీలు టాప్ సర్వీస్‌లపై ప్రయాణిస్తున్నారు. గురువారం కంచుపాడు నుంచి కూలీలు ఒక అశోక్ లీలాండ్ ఆటో టాప్‌పై కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇలా వెళ్లితే ప్రమాదాలు సంభవించి కుటుంబాలకు దూరమవుతారు. దీనిపై పోలీస్ శాఖ పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాని మోదీ పాలనతో దేశాభివృద్ధి



ఎర్రవల్లిచౌరస్తా: ప్రధాని నరేంద్ర మోదీ పాలనతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మోదీ పది సంవత్సరాల పాలనలో దేశ రక్షణ, గ్రామాల అభివృద్ధి, కరోన సమయంలో ఉచిత వ్యాక్సిన్, రేషన్ బియ్యం, రైతులకు రూ.6000 నగదు, సబ్సిడీ ఎరువులతో పాటు అనేక పథకాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కేంద్ర పథకాలను చూసి ఆకర్షితులైన వివిధ పార్టీల కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

అల్లిపీర స్వామి ఆశ్రమానికి విరాళం



అయిజ: మండలంలోని రాజాపురంలో నిర్వహిస్తున్న అల్లిపీర స్వామి ఆశ్రమానికి బీఆర్‌ఎస్ నాయకుడు రాముడు రూ. 50 వేల విరాళం అందజేశారు. పులికల్, రాజాపురం గ్రామాలకు చెందిన అల్లిపీర స్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు ఆయనను కలిసి ఆశ్రమం అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో ఆశ్రమ అభివృద్ధికోసం విరాళం అందజేశారు.

మండల విద్యాశాఖ అధికారికి సన్మానం



కేటీదొడ్డి: 75వ గణతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్‌తో మండల విద్యాశాఖ అధికారి సురేష్ ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం ఆయనను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్యానాయక్, పాగుంటన్న, గీత, సీఆర్‌పీలు యుగంధర్, శివరాజ్, పాపయ్య ఉన్నారు.

24గంటలు గ్రామాల్లో ఉండాలి


శాంతినగర్‌లో బీజేపీ శ్రేణులకు సూచనలిస్తున్న జిల్లా ఉపాధ్యక్షులు కేకే రెడ్డి

శాంతినగర్: ప్రతి నాయకుడు, కార్యకర్తా 24 గంటల పాటు గ్రామాల్లో గడపాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి అన్నారు. గురువారం వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల అధికారులు, పై స్థాయి నాయకులంతా ఒక గ్రామాన్ని ఎంచుకుని ఆ గ్రామంలో 24 గంటలు ఉంటూ అక్కడనే రాత్రి బసచేసి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 9 ఏళ్ల పాలనపై వివరించాలన్నారు. గ్రామాల్లో వేసే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రైతు వేదికలు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, చివరికి ఎల్‌ఈడీ లైట్లు కూడా కేంద్రానివే అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రాజశేఖర్‌గౌడ్, శివ, విజయ్‌గౌడ్, రాఘవేంద్ర, రాము, గణేష్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో 'పది' తొలిమెట్టు

గట్టు: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించే క్రమంలో పదో తరగతి తొలిమెట్టు అని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మాచర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ఎంపీపీ విజయ్‌కుమార్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పదో తరగతిలో మాచర్ల ఉన్నత పాఠశాల వందశాతం ఫలితాలు సాధించాలని కోరారు. జెడ్పీటీసీ బాసు శ్యామల మాట్లాడుతూ మాచర్ల ఉన్నత పాఠశాల సమస్యల పరిష్కారాన్ని జెడ్పీ నుంచి రూ.2 లక్షలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు, సిద్ధిరామప్ప, మైనార్టీ అధ్యక్షుడు ఉన్నారు.


మాచర్ల పాఠశాల విద్యార్థులకు ప్రశ్నాపత్రాల కిట్లను అందజేసిన ఎంపీపీ విజయ్‌కుమార్

గ్రామాల అభివృద్ధికి కష్టపడి పనిచేయాలి


సర్పంచ్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కేటీదొడ్డి: గ్రామాల అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తే పేరు చరిత్రలో నిలిచిపోతుందని పంచాయతీ కార్యదర్శి హరికుమార్ అన్నారు. మండలంలోని ఎర్సందొడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదేళ్ల సర్పంచ్ పదవీకాలం ముగిసిన సందర్భంగా గురువారం సర్పంచ్ గోపాల్, ఉప సర్పంచ్ జమ్మన్న, వార్డు మెంబర్లను శాలువాలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం..

గట్టు: ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు గురువారం పంచాయతీ కార్యాలయాల్లో సన్మానించారు. బల్గెరలో సర్పంచ్ హనుమంతునాయుడు, వార్డు సభ్యులను జెడ్పీటీసీ బాసు శ్యామల శాలువా పూలమాలతో సన్మానించారు. ఐదేళ్ల కాలంలో గ్రామానికి చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపవతి, కార్యదర్శి సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గట్టు పంచాయతీ సర్పంచ్ ధనలక్ష్మిని, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సత్యనారాయణ, సీనియర్ హెచ్‌ఎం గోవిందప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.


బల్గెరలో సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన జెడ్పీటీసీ శ్యామల

దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో అల్పాహారం అందిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పాఠశాల జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని ఎంపీటీసీ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన 2000–01 సంవత్సరం పూర్వ విద్యార్థులు రాంబాబు, కృష్ణారెడ్డి అల్పాహారం వితరణకు రూ.22 వేలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉదయం వేళ ప్రత్యేక తరగతులకు ఇంటి నుంచి ఏమి తినకుండా వస్తున్నారనే విషయాన్ని తెలియపర్చడంతో దాతలు ముందుకొచ్చి ఆర్థిక తోడ్పాటునందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల తరఫున సన్మానించారు. కార్యక్రమంలో దాత రాంబాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎంపీటీసీ హైమావతి, దాతలు

పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని వినతి

అలంపూర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మాజీ ఎంపీ మందా జగన్నాథం గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో తన దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినప్పుడే తనకు పెద్దలు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి తనకు తప్పకుండా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలని కోరినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

ఇటుక బట్టీల వద్ద ప్రైవేట్ టీచర్ నియామకం

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద పనులు చేసే కూలీల పిల్లల చదువు కోసం ప్రైవేట్ టీచర్‌ను నియమించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం ఇటుక బట్టీల వద్ద ఉన్న బడిఈడు పిల్లలను సీఆర్పీలతో కలిసి ఎంఈఓ పరిశీలించారు. ఎంఈఓ మా ట్లాడుతూ ఇటుక బట్టీల వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన పలువురు కూలీలు పనులు చేస్తున్నా రు. పనులు చేసే కూలీల పిల్లలు చదువుకు దూరం కాకుండా ఉండేందుకు ప్రైవేట్ టీచర్ ను నియమించి విద్యను బోధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సమగ్ర సమాచారం పొందుపర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్


సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు

అలంపూర్: పాఠశాలల సమగ్ర సమాచారం పొందుపర్చాలని ఉండవెల్లి ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కళాశాలలో ఉండవెల్లి, మానవపాడు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ శివప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రతి రోజు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపై చర్చించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల ఫలితాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఎస్ఏ–1, ఎఫ్ఏ–1, ఎఫ్ఏ–2, ఎఫ్ఏ–3 పరీక్షల వివరాలను ఆప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో ఉండవెల్లి, మానవపాడు మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రవల్లిచౌరస్తా: జిల్లా స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఇటిక్యాల గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి సాయితేజ ఉత్తమ ప్రతిభను కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య గురువారం తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక టాలెంట్ టెస్టులో విద్యార్థి ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో మొదటి బహుమతి రూ.10,000 నగదుతో పాటు మెమొంటోను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభను కనబర్చిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

జోరుగా 'ఉపాధి' పనులు

- కూలీలకు చేయూతనిస్తున్న ఉపాధి హామీ పథకం
- పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు


పాల్వాయిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

మల్దకల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. ఉపాధి పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో హాజరవుతుండటంతో కూలీలతో సందడి నెలకొంది. జాబ్‌కార్డులున్న కూలీలకు ఉపాధి హామీ పనులపై అధికారులు అవగాహన కల్పించడంతో యువకులు మరింత సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఎక్కడ పనులు చేయాలో ముందుగానే ప్రణాళికలు వేసుకుంటారు. ప్రస్తుతం గ్రామాల్లో పొలం పనులు పూర్తి కావడంతో కూలీలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ బాటపట్టారు. దీంతో పనులు చేస్తున్న ప్రదేశాల్లో కూలీలతో జాతర తలపిస్తోంది. గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 68,157 జాబ్‌కార్డులున్నాయి. జాబ్ కార్డు ఉన్న కూలీలు ప్రతి రోజు పనుల్లో పాల్గొంటున్నారు. మల్దకల్ మండలంలో ప్రస్తుతం 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాలలో రోజుకు 50 నుంచి 100 వరకు, గ్రామాల్లో 20 నుంచి 50 మంది వరకు కూలీలు పనులకు తరలివెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో కూలీలు ముళ్లపొదల తొలగింపు, పొలాల చదును, చెరువులు, కుంటల పూడిక తీత, పంట కాల్వల్లో పేరుకున్న మట్టిని తొలగించడం, వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు, పశువుల షెడ్ల నిర్మాణం, పంట పొలాలు, ఆవాస గ్రామాలకు మట్టి రోడ్ల నిర్మాణం వంటి పనులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో యాసంగి పనులు పూర్తి కావడంతో కూలీలు ఉపాధి పనుల్లో నిమగ్నమయ్యారు.


నీలిపల్లిలో పనులు చేస్తున్న కూలీలు

కుటుంబానికి ఆసరాగా ఉపాధి



గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులతో కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుంది. గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న వారంతా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. నాకు పని లభించినందుకు సంతోషంగా ఉంది.

– వీరేష్, బూడిదపాడు.

ప్రతిరోజూ ఉపాధి పనికి పోతున్నాం..



గ్రామంలో ఉపాధి పనులకు ప్రతి రోజూ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్నాం. ఉదయం ఉపాధి కూలీ పనులు చేస్తూ మధ్యాహ్నం ఇతర పనులు చేసుకుంటున్నాం. వచ్చిన ఆదాయంతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నా.

– అబులన్న, అమరవాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పనులపై మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించాం. గ్రామాల్లో దాదాపు యాసంగి పనులు పూర్తయ్యాయి. జాబ్ కార్డులు ఉన్న కూలీలు, యువత, మహిళలు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలి.

– కృష్ణయ్య, ఎంపీడీఓ, మల్దకల్